
సంపుటి :02 సంచిక :266 పేజీలు :07 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com
Voice of the people



# మున్సిపల్ ఎన్నికలకు ముందడుగు

- ఓటర్ జాబితా తయారీ, జాబితా ప్రచురణకు నోటిఫికేషన్
- బల్దియా ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష తర్వాత కీలక అప్‌డేట్
- రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 నగరపాలక సంస్థల్లో ప్రక్రియ
- 1న ఓటర్ల జాబితా ప్రచురణ.. 5, 6న పొలిటికల్ పార్టీలతో మీటింగ్
- ఆ తర్వాత బల్దియా ఎన్నికల నగరా

2

మంగళవారం 30, డిసెంబర్ 2025



## ఉద్యోగుల సంక్షేమానికి కంపెనీ కట్టుబడి ఉంది

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- మృతి చెందిన అన్ మ్యాన్డ్ వర్కర్ కుటుంబానికి రూ.25 లక్షల చెక్కు అందజేత
- విద్యుత్ ప్రమాదాల నివారణకు 'ఎల్సీ యాప్' వినియోగం

5




# మెగా రైల్వే డిపోకు అడుగులు

### మొన్నటివరకు మానుకోట నుంచి ప్రాజెక్ట్ తరలిపోతుందనే ప్రచారం

**భగ్గుమన్న విద్యార్థి, ప్రజా, రాజకీయ పార్టీలు**

- అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం
- ప్రజాప్రతినిధుల చొరవతో సమస్యకు పరిష్కారం
- మానుకోటలోనే ప్రాజెక్ట్ ఉంటుందని కేంద్రం స్పష్టత
- రాష్ట్రప్రభుత్వం ప్రాజెక్ట్‌కు 409 ఎకరాల భూమి కేటాయింపు

2

దక్షిణ మధ్య రైల్వే మహబూబాబాద్ శివారులో త్వరలోనే వందేభారత్ మెగా మెయింటెనెన్స్ పీరియాడికల్ ఓవరాలింగ్ ప్రాజెక్ట్ (మెగా రైల్వే ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో) పనులు ప్రారంభించనున్నది. డిపో ఇక్కడి నుంచి తరలిపోతుందనే ప్రచారం జరగడంతో నిన్నమొన్నటివరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. డిపో రాజకీయపరంగా హాట్ టాపిక్‌గా మారింది. అయితే..ఆ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. మహబూబాబాద్‌లోనే రైల్వే మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. మరోవైపు డిపో ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం కూడా 409.1 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ ఉత్వర్వులు జారీ చేయడంతో సమస్య సద్దుమణిగింది. మరోవైపు ప్రాజెక్ట్ కోసం రైల్వే ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించారు. సాంకేతిక పరంగా అన్ని సానుకూలతలు ఉన్నప్పటికీ రాజకీయ ఆందోళనల వల్ల పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. ఏదైతేనేం.. మొత్తానికి మహబూబాబాద్‌కు డిపో ఖరారు కావడం పట్ల జిల్లా ప్రజల పట్ల హర్షం వ్యక్తమవుతున్నది

– అక్షరదర్బార్, మహబూబాబాద్




5

## 12.30 లోపు ముగించుకోవాలి

- మత్తు పదార్థాలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు
- నూతన సంవత్సర వేడుకలపై సీపీ సన్ ప్రీత్ సింగ్
- సంతోషాల నడుమ వేడుకలు నిర్వహించుకుందామని సూచన

## సమావేశంతో సక్సెస్ చేయాలి



- మేడారం జాతర నిర్వహణపై మంత్రి సీతక్క
- శ్రీ సమ్మక్క సారలమ్మ కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగేలా జాతర నిర్వహిస్తామని వెల్లడి

6



## ఏసీబీకి చిక్కిన సర్వేయర్

- పార్ట్ టైం ఉద్యోగి ద్వారా బాధితుడిపై ఒత్తిడి
- రూ.5 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ
- నిర్మల్ జిల్లాకేంద్రంలో ఘటన

2

# మెగా రైల్వే డిపోకు అడుగులు

- మొన్నటివరకు మానుకోట నుంచి ప్రాజెక్ట్ తరలిపోతుందనే ప్రచారం
- భగ్గుమన్న విద్యార్థి, ప్రజా, రాజకీయ పార్టీలు
- అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం
- ప్రజాప్రతినిధుల చొరవతో సమస్యకు పరిష్కారం
- మానుకోటలోనే ప్రాజెక్ట్ ఉంటుందని కేంద్రం స్పష్టత

- రాష్ట్రప్రభుత్వం ప్రాజెక్ట్ కు 409 ఎకరాల భూమి కేటాయింపు




అక్షరదర్బార్, మహబూబాబాద్ :
దక్షిణ మధ్య రైల్వే మహబూబాబాద్ శివారులో త్వరలోనే వందేభారత్ మెగా మెయింటెనెన్స్ పీరియాడికల్ ఓవరాలింగ్ ప్రాజెక్ట్ (మెగా రైల్వే ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపో) పనులు ప్రారంభించనున్నది. డిపో ఇక్కడి నుంచి తరలిపోతుందనే ప్రచారం జరగడంతో నిన్నమొన్నటివరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు జరిగాయి. డిపో రాజకీయపరంగా హాట్ టాపిక్‌గా మారింది. అయితే..ఆ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ తాజాగా కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. మహబూబాబాద్‌లోనే రైల్వే మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. మరోవైపు డిపో ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం కూడా 409.1 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ ఉత్వర్వులు జారీ చేయడంతో సమస్య సద్దుమణిగింది. మరోవైపు ప్రాజెక్ట్ కోసం రైల్వే ఉన్నతాధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించారు. సాంకేతిక పరంగా అన్ని సానుకూలతలు ఉన్నప్పటికీ రాజకీయ ఆందోళనల వల్ల పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. ఏదైతేనేం.. మొత్తానికి మహబూబాబాద్‌కు డిపో ఖరారు కావడం పట్ల జిల్లా ప్రజల పట్ల హర్షం వ్యక్తమవుతున్నది.

**- ప్రాజెక్ట్ నేపథ్యం ఇది**

మహబూబాబాద్ ప్రాంతంలో రైల్వే మెయింటెనెన్స్ డిపో ఏర్పాటు చేస్తామని గతంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాదు.. ప్రాజెక్ట్ పనులకు రూ.908.15 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్ట్‌ను తన తండ్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని నష్కల్ సమీపంలో ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరడంతో ప్రాజెక్ట్ మహబూబాబాద్ నుంచి తరలిపోతోందని ప్రచారం జరిగింది. దీంతో రాజకీయ, ప్రజా, విద్యార్థి సంఘాలు, సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ నేతలు పోరాటానికి దిగారు. గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని, ఇలాంటి మెగా ప్రాజెక్టు తరలిపోతే ఈ ప్రాంత నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఒకదశలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వాగ్యుద్ధం నడిచింది.

**- ఎంపీ, ఎమ్మెల్యే చొరవ**

పోరాటాల నేపథ్యంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భుక్యా మురళీనాయక్ హుటాహుటిన హైదరాబాద్‌కు చేరుకుని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి విషయం వివరించారు. ప్రాజెక్ట్ ఏర్పాటుకు అన్ని విధాలా మహబూబాబాద్ ప్రాంతమే అనుకూలమని రెఫరెండం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, మానుకోట సమీపంలోని అనంతారం రైల్వే ట్రాక్ సమీపంలో 409.01 ఎకరాల ప్రభుత్వ భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

**- ప్రత్యక్షంగా వేల మందికి ఉపాధి**

పీరియాడికల్ ఓవరాలింగ్ మెగా మెయింటెనెన్స్ డిపో అందుబాటులోకి వస్తే దాదాపు ఐదు వేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. సరుకు రవాణా రైళ్ల నిర్వహణతో పాటు వందే భారత్ కోచ్‌ల మరమ్మతులు ఇక్కడే అంటే రైళ్లకు చేసే అత్యంత కీలకమైన సమగ్ర తనిఖీ వ్యవస్థ ఇక్కడ అందుబాటులోకి వస్తుంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ మొత్తంలో ఇలాంటి మెగా డిపో రావడం ఇదే మొదటిసారి. రైళ్ల ఇంజన్లు బోగీల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ కేంద్రం గుండెకాయలా పనిచేస్తుంది. దీనివల్ల రైల్వే వ్యవస్థలో కొత్త సాంకేతిక విప్లవం రానుంది. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో ఇది అతిపెద్ద నిర్వహణ కేంద్రంగా నిలువనుంది. వేలాది మందికి ఉపాధి కల్పనతోపాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఈ ప్రాజెక్టుపై ఉమ్మడి జిల్లావాసుల ఆశలు భారీగా ఉన్నాయి.

# మున్సిపల్ ఎన్నికలకు ముందడుగు




- ఓటర్ జాబితా తయారీ, జాబితా ప్రచురణకు నోటిఫికేషన్
- బల్దియా ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్ష తర్వాత కీలక అప్ డేట్
- రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, 6 నగరపాలక సంస్థల్లో ప్రక్రియ
- 1న ఓటర్ల జాబితా ప్రచురణ.. 5, 6న పొలిటికల్ పార్టీలతో మీటింగ్
- ఆ తర్వాత బల్దియా ఎన్నికల నగరా

అక్షరదర్బార్, హైదరాబాద్ :
తెలంగాణలో మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల ఎన్నికలకు సంబంధించి రాష్ట్రఎన్నికల సంఘం కీలక ముందడుగు వేసింది. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ల జాబితా సిద్ధం, జాబితా ప్రచురణకు నోటిఫికేషన్ విడుదల చేసింది. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సీఎస్ రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్న ఈ సమీక్షలో సీఎం ఎన్నికలపై నిర్ణయం తీసుకున్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్, నగరపాలక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకున్నది. ఈ నోటిఫికేషన్ ప్రకారం.. రాష్ట్రంలోని 117 మున్సిపాలిటీలు, ఆరు నగరపాలక సంస్థల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేసేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ ప్రక్రియ జనవరి 10న ఓటర్ల జాబితా తుది ప్రచురణతో ముగుస్తుంది.

**- 1న ముసాయిదా ప్రచురణ**

ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్ ప్రకారం మంగళవారం పోలింగ్ కేంద్రాల డేటా పునర్వ్యవస్థీకరణ ముగిసింది. బుధవారం నాటికి వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల డేటా సిద్ధమవుతుంది. జనవరి 1న వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులపై ప్రదర్శన జరుగుతుంది. జాబితాలపై అభ్యంతరాలు, సవరణలు ఉంటే ప్రజలు తెలియజేయవచ్చు. జనవరి 5, 6వ తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మున్సిపల్, జిల్లా స్థాయిల్లో సమావేశాలు ఉంటాయి. ఎన్నికల సంఘం అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా నిర్ణయించింది. అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా యంత్రాంగం వార్డుల వారీగా ఫొటో గుర్తింపు కార్డులతో కూడిన జాబితా రూపొందిస్తుంది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వార్డుల విభజన ప్రక్రియ జనవరి 9వ తేదీ నాటికి పూర్తి కానుంది. ఆ తర్వాత ఈ మున్సిపాలిటీకి కూడా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది. ఓటర్ల జాబితా తుది ప్రచురణ పూర్తయిన వెంటనే రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగే అవకాశం ఉంది.

**- ఇప్పటికే మున్సిపల్ శాఖ నివేదిక**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు 123 పట్టణ స్థానిక సంస్థలు సిద్ధంగా ఉన్నాయని మున్సిపల్ పరిపాలన శాఖ ఇప్పటికే నివేదిక సమర్పించింది. వీటిలో మొత్తం 2,996 వార్డులు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ జనాభా గణన వివరాలను కూడా ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలు త్వరలోనే పూర్తి కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సందడి మొదలు కావడంతో అభ్యర్థులు ప్రచారానికి సిద్ధమవుతున్నారు.

# ఏసీబీకి చిక్కిన సర్వేయర్

- పార్ట్ టైం ఉద్యోగి ద్వారా ఒత్తిడి
- రూ.5 వేల తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ
- నిర్మల్ జిల్లాకేంద్రంలో ఘటన



అక్షరదర్బార్, నిర్మల్: నిర్మల్ జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన మెరుపు దాడిలో ఒక మండల సర్వేయర్ లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. నిర్మల్ టౌన్ ల్యాండ్ రికార్డ్స్ సర్వేయర్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ వర్మకు నిర్మల్ రూరల్ మండల ఇన్‌చార్జి బాధ్యతలు కూడా ఉన్నాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన రైతు తన భూమిని డిమార్కేషన్ చేయాలని కోరగా సర్వేయర్ ఈ అక్రమ వసూళ్లకు తెరలేపారు. పంట భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించేందుకు రైతు నుంచి సర్వేయర్ 15 వేలు లంచం అడిగారు. బాధితుడు ఇప్పటికే వారం రోజుల క్రితం రూ.5 వేలు ముట్టజెప్పారు. మిగిలిన రూ.10 వేల కోసం సర్వేయర్ తన దగ్గర పార్ట్ టైమ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగరాజు ద్వారా ఒత్తిడి తెచ్చారు. అంత డబ్బు ఇచ్చుకోలేనని రైతు ప్రాధేయపడటంతో చివరికి మరో 5 వేలు బేరం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో బాధితుడు ఆదిలాబాద్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

**- పక్కా ప్లాన్ తో..**

ఏసీబీ డీఎస్పీ మధు నేతృత్వంలో అధికారులు పక్కా వ్యూహంతో దాడులు నిర్వహించారు. మంగళవారం సాయంత్రం శాంతినగర్ చౌరస్తా వద్ద రైతు నుంచి నాగరాజు 5 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నాగరాజును విచారించగా సర్వేయర్ బాలకృష్ణ వర్మ ఆదేశాల మేరకే తాను ఈ డబ్బులు తీసుకున్నట్లు అంగీకరించారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన అధికారులు సర్వేయర్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరినీ నిర్మల్ తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అవినీతి నేరం రుజువు కావడంతో సర్వేయర్ బాలకృష్ణ వర్మ, సహాయకుడు నాగరాజును అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులిద్దరినీ కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

# బీఆర్ఎస్ శాసనసభ ఉప నేతలుగా హరీశ్, సబితా, తలసాని

- మండలి ఉప నేతలుగా రమణ, పోచంపల్లి
- విప్ గా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- బల్దియా ఎన్నికలు సమీపిస్తున్న వేళ గులాబీ దళపతి కేసీఆర్ కీలక నిర్ణయం

అక్షరదర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ పరంగా కీలక నియామకాలు చేపట్టారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా ఇప్పటికే కేసీఆర్ కు కీలక బాధ్యతలు ఉండగా, మంగళవారం ఆయన తనకు సాయంగా మరో ముగ్గురు సీనియర్ నేతలను శాసనసభ పార్టీ ఉపనేతలుగా నియమించారు. మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. సభలో ప్రభుత్వంపై పోరాడేందుకు, పార్టీ గొంతుకను బలంగా వినిపించేందుకు శాసనసభ ఉప నేతలుగా నియమించారు. అలాగే శాసన మండలిలో పార్టీ ఉపనేతలుగా ఎల్ రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. వీరితో పాటు మండలి పార్టీ విప్‌గా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు అవకాశం కల్పించారు. మండలిలో ఇప్పటికే ఎస్ మధుసూదనాచారి ప్రతిపక్ష నాయకుడిగా కొనసాగుతుండగా.. తాజా నియామకాలతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయం గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. శాసనమండలిలో బీఆర్ఎస్ ఉపనేతలుగా నియమితులైన వారిలో ఒకరైన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి స్వగ్రామం హనుమకొండ జిల్లా నడికూడ మండలంలోని వరికోలు.

# న్యూఇయర్ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలి

**- జిల్లా ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్**



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైమ్: డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సరం సందర్భంగా హ్యాపీ న్యూ ఇయర్ వేడుకలను శాంతియుతంగా, నిబంధనలకు లోబడి జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ప్రజలకు సూచించారు. ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వేడుకలు నిర్వహించాలని ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శాంతి–భద్రతలకు భంగం కలగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా, భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. పోలీస్ అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఈవెంట్లు, బహిరంగ కార్యక్రమాలు నిర్వహించరాదని, జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని గుర్తు చేశారు. ప్రైవేట్ ఈవెంట్లు నిర్వహించదలచిన వారు తప్పనిసరిగా పోలీస్ మరియు ఎక్సైజ్ శాఖల అనుమతులు పొందాలని సూచించారు. రోడ్లపై కేక్ కటింగ్‌లు చేయడం, టపాకాయలు వెలిగించడం, బైక్ రేసింగ్‌లు నిర్వహించడం చట్టప్రకారం నేరమని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇళ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాల్లో స్పీకర్లు, సౌండ్ బాక్సులు, మైక్ సిస్టమ్‌లు ఏర్పాటు చేయాలంటే పోలీస్ అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు. జిల్లా లోని ప్రతి మండల పరిధిలో ఒకే నిబంధనలు అమల్లో ఉంటాయని తెలిపారు. యువత నిబంధనలను పాటిస్తూ, బాధ్యతాయుతంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకుని, పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.




# విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలి

**–ఎక్సైజ్ ఎస్ఐ శార్వాణి**

అక్షర దర్బార్, నర్సంపేట : విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, మత్తు పానీయాలకు బానిస కావద్దని ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ఎస్ఐ శార్వాణి సూచించారు. మంగళవారం భద్రకాళి ఒకేషనల్ జూనియర్ కాలేజీలో ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సరదా కోసం మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఆరోగ్యంతో పాటు భవిష్యత్తు కూడా నాశనం అవుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా టీనేజర్లు, యువత డ్రగ్స్ వైపు ఆకర్షితులవుతున్నారని, దీనివల్ల జీవితాలు అంధకారంలోకి వెళ్తున్నాయని అన్నారు. మత్తు మాదకద్రవ్యాల వినియోగంపై కఠిన చట్టాలు ఉన్నాయని, వాటిని వినియోగించే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతారని తెలిపారు. కార్యక్రమంలో యుపిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న యూపీఎన్ఎం జిల్లా కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్ ఏ ఐ ఎఫ్ డి ఎస్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్, ఏ ఐ ఎఫ్ డి ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# ఎస్ఐ ని కలిసిన ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు



అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఎస్ఐ జక్కుల పరమేశ్వర్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐని సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంగుల మనోహర్ రెడ్డి, జిల్లా నాయకులు గంట శ్యాంసుందర్ రెడ్డి, చల్లా సమ్మిరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

**–శివాజీ నగర్ సర్పంచ్ నాగరాజు**



అక్షర దర్బార్, దుగ్గొండి : ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని శివాజీ నగర్ గ్రామ సర్పంచ్ సుకిన నాగరాజు అన్నారు. మంగళవారం దుగ్గొండి మండలంలోని శివాజీ నగర్ గ్రామంలో గ్రామస్తులతో కలిసి శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తన సొంత ఖర్చులతో శివాజీ నగర్–లక్నపల్లి ప్రధాన రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను రేకంపల్లి గ్రామ శివారు వరకు తొలగించారు. ప్రయాణికుల సౌకర్యార్థం చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని గ్రామస్తులు, ప్రయాణికులు సర్పంచ్ నాగరాజును ప్రశంసించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పద్మశాలీ ప్రజాప్రతినిధులకు సన్మానం



అక్షర దర్బార్ శాయంపేట : పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు సామల మధుసూదన్ అన్నారు. మంగళవారం మండలంలో నూతనంగా ఎన్నికైన పద్మశాలి సర్పంచులు, వార్డు సభ్యులకు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మధుసూదన్ మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావంతో పేదరికంలో ఉన్న తోటి పద్మశాలీ కుటుంబాలకు చేయూత అందించాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కందగట్ల ప్రకాష్, వావిలాల వేణుగోపాల ప్రసాద్, కోశాధికారి రంగు శ్రీధర్,నాయకులు జలంధర్, మాచర్ల రవి,వావిలాల రాజేందర్,బాసని లక్ష్మీనారాయణ, సదాశివుడు, గుండా రమేష్, దాసరి కుమారస్వామి, వెంకటేశ్వర్లు, బదుగు రవీందర్,అశోక్, భాను తదితరులు పాల్గొన్నారు.



# బ్లాక్ దందాకు నిలయంగా హెచ్‌పీ గ్యాస్ గోదాం

- **తక్షణమే టెండర్ నిర్వహించాలి**
- **సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ డిమాండ్**

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్ గోదాం బ్లాక్ దందాకు అడ్డాగా మారిందని, తక్షణమే టెండర్ నిర్వహించి అక్రమాలను అరికట్టాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, రూ.875గా నిర్ణయించిన గ్యాస్ సిలిండర్‌ను గోదాం నిర్వాహకులు అక్రమంగా షాపుదారులు, వినియోగదారులకు రూ.1000 నుంచి రూ.1100 వరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. వినియోగదారుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు. ఈ అక్రమాలు జరుగుతున్నప్పటికీ మండల పౌర సరఫరాల శాఖ అధికారి చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో గ్యాస్ గోదాం నిర్వాహకులు ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అంబాల అశ్వద్ధామ, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంధకారంలో ఆర్వోబీ

- **వెలగని స్ట్రీట్ లైట్లు**
- **ఇబ్బందుల్లో వాహనదారులు**
- **వెంటనే వీధిలైట్లను మరమ్మతు చేయాలి : సీపీఐ నేత మంద భాస్కర్**



అక్షర దర్బార్, కేసముద్రం: కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఆర్ఓబి, వీధిలైట్లు వెలగకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ నాయకుడు మంద భాస్కర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఓబి, వీధిలైట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీగా ఏర్పడినప్పటికీ సమస్యలు మాత్రం పరిష్కారం కాకుండా అలాగే కొనసాగుతున్నాయన్నారు. ఆర్ఓబి పై లైట్లు వెలగకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, విలీన గ్రామాల్లో వీధిలైట్లు లేక గ్రామాలు కారు చీకట్లో కమ్ముకున్నాయన్నారు. రాత్రి వేళల్లో ప్రజలు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు మొద్దు నిద్ర వీడి, ఆర్ఓబి వద్ద లైట్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు విలీన గ్రామాల్లో వీధిలైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాసు సాయిచరణ్, మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం పరకాల కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా దుగ్యాల రాజేశ్వర్ రావు
- మహిళా సర్పంచులకు బదులు హాజరైన వారి భర్తలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలంలోని 10 గ్రామాల సర్పంచులు ఏకమై "పరకాల మండలం సర్పంచుల ఫోరం"ను మంగళవారం ఏర్పాటు చేసి వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ దుగ్యాల రాజేశ్వ రావును ఫోరం అధ్యక్షు డిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా ఈ ఫోరంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



అధ్యక్షుడు, దుగ్యాల రాజేశ్వర్ రావు

## ఫోరం కమిటీలో పలు కీలక పదవులు.

ఉపాధ్యక్షురాలిగా కామారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ చిర్ర అనిత, ప్రధాన కార్యదర్శిగా నాగారం గ్రామ సర్పంచ్ ఏరుకొండ రమాదేవి, కోశాధికారిగా అలియాబాద్ గ్రామ సర్పంచ్ శాతరాశి సనత్ కుమార్ పటేల్, కార్యదర్శిగా పోచారం గ్రామ సర్పంచ్ పెంతల మధుకర్ లను ఎన్నుకున్నారు. అలాగే కమిటీ సభ్యులుగా లక్ష్మీపురం గ్రామానికి చెందిన పల్లెబోయిన గీతరాణి, హైబోతుపల్లి గ్రామ సర్పంచ్ కాసగాని సంపత్, మల్ల కృపేట గ్రామ సర్పంచ్ దొమ్మటి కవిత, పైడిపెల్లి గ్రామ సర్పంచ్ బొచ్చు రమేష్ లను ఎన్నుకున్నారు.

## మహిళా సర్పంచులకు బదులు హాజరైన భర్తలు



మహిళలకు రిజర్వ్ అయిన గ్రామపంచాయతీల్లో సర్పంచులుగా ఎన్నికైన మహిళల స్థానంలో వారి భర్తలు అధికారిక సమావేశాలు, కార్యక్రమాలకు హాజరవుతుండడం చర్చనీయాంశమైంది. తాజాగా జరిగిన ఒక మండలస్థాయి సమావేశంలో కూడా మహిళా సర్పంచుల బదులు వారి భర్తలే పాల్గొనడం గమనార్హం. ప్రభుత్వం మహిళలకు రాజకీయంగా అధికారం ఇవ్వాలనే ఉద్దేశంతో రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, ఆ లక్ష్యం పూర్తిగా అమలవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మహిళా సర్పంచుల స్థానంలో భర్తలు వ్యవహరించడం వల్ల మహిళల స్వతంత్ర నిర్ణయాధికారం దెబ్బతింటోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ అంశంపై సంబంధిత అధికారులు స్పందించి, మహిళా సర్పంచులే తప్పనిసరిగా సమావేశాలకు హాజరై పాలనలో చురుగ్గా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



# బాధిత రైతుకు ఆర్థిక సహాయం అందజేత

అక్షర దర్బార్, చిట్యాల : పెద్దపులి దాడిలో ఎద్దును కోల్పోయిన చిట్యాల మండలంలోని చిలకపేట శివారు గాంధీనగర్‌కు చెందిన రైతు రాజపోషాలుకు అటవీ శాఖ భూపాలపల్లి అధికారుల ఆధ్వర్యంలో తక్షణ నష్టపరిహారం అందించారు. ఎఫ్ఆర్వో చంద్రమౌళి చేతుల మీదుగా మంగళవారం రూ.10,000ను బాధిత రైతుకు అందజేశారు. మిగిలిన నష్టపరిహారం మొత్తాన్ని తెలంగాణ ప్రభుత్వ జీఓ ప్రకారం సంబంధిత రైతుకు త్వరలో చెల్లిస్తామని ఎఫ్ఆర్వో చంద్రమౌళి తెలిపారు. ఈ కార్యక్రమంలో రత్నం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలో గొర్రెలు, మేకలకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ తౌటం లక్ష్మీ అంతయ్య, ఉపసర్పంచ్ బుర్ర వెంకటేశ్ ప్రారంభించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డా. జి. వెంకన్న మాట్లాడుతూ, ఈ మందుల వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉండి బరువు పెరుగుతాయని తెలిపారు. ఇప్పటివరకు మండలంలో సుమారు 2000 జీవాలకు నట్టల మందులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ Dr G వెంకన్న, వెటర్నరీ సర్జన్ Dr అజయ్ అప్పని లతో పాటు పశు వైద్య సహాయ సిబ్బంది కవిత , దివ్య , కరుణాకర్ , రాజేందర్ రెడ్డి, గొర్రెలు మరియు మేకల పెంపకం దారులు పాల్గొనడం జరిగినది.






# వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పలు చోట్ల అన్నదానాలు

అక్షర దర్బార్, వెంకటాపూర్ : వెంకటాపూర్ మండల వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు ముదుంబ రఘునాథ చార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి మామిడి, కొబ్బరి తోరణాలు కట్టి, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేసి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ సరిడ్ల భాస్కర్ ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో వెంకటాపూర్ గ్రామ ఉపసర్పంచ్ అన్నబోయిన రాజు, వర్తక సంఘ సభ్యులు చింతిరెడ్డి రమణారెడ్డి, అంచూరి సతీష్, సమ్మయ్య, ప్రసాద్, లక్ష్మారెడ్డి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## మొట్లపల్లిలో..

అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి : ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా జరిగాయి. మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున రావడంతో ఆలయ ప్రాంగణం పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ చైర్మన్ గూడూరు రఘుపతి రెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల్పించకుండా వసతులు కల్పించారు. ఆలయ పూజారి రంగయ్య చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



# విద్యారంగం అభివృద్ధికి ఎస్ఎఫ్ఐ కృషి

–జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ జెండాను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1970 డిసెంబర్ 30న త్రివేండ్రంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందని, గత 55 ఏళ్లుగా విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ విద్యారంగంలో అనేక మార్పులు తీసుకువచ్చిందన్నారు. విద్యారంగంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు అధిక నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మడికొండ ప్రశాంత్, ఆత్మకూర్ మండల అధ్యక్షుడు బొజ్జ హేమంత్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



# అధ్యక్షుడి ఎన్నికపై ఆసక్తి

- చర్చనీయాంశమైన నడికూడ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడి ఎన్నిక
- ప్రమాణ స్వీకారం తర్వాత మొదలైన రాజకీయ చర్చ

అక్షరదర్బార్, నడికూడ:
తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ లు ఈనెల 22న ప్రమాణ స్వీకారం చేశారు. ఆ తర్వాత హనుమకొండ జిల్లా నడికూడ మండలంలో సర్పంచుల ఫోరం అధ్యక్ష పదవిపై ఆసక్తికర చర్చ తెరపైకి వచ్చింది. సర్పంచుల ఫోరం మండల అధ్యక్ష పదవి ఎవరికి దక్కనుందనే అంశంపై సర్పంచుల మధ్య తర్జనభర్జన నడుస్తుంది.

## - కాంగ్రెస్ పార్టీ విధేయులకే పదవి

మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్న సర్పంచులకు ఫోరం అధ్యక్ష పదవి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న ప్రచారం మండలంలో జోరుగా సాగుతోంది. పార్టీ సమీకరణాలు, సీనియారిటీ, రాజకీయ అనుభవం వంటి అంశాలు ఈ ఎంపికలో కీలకంగా మారనున్నట్లు తెలుస్తోంది.

## - కాంగ్రెస్ మద్దతు సర్పంచులు వీరే

నడికూడ మండలంలో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గ్రామ పంచాయతీ వారీగా రామకృష్ణాపూర్ – పెండ్లి లక్ష్మి, కంఠాత్మకూర్ – కొంగంటి తిరుపతి, ధర్మారం – భాషిక ఎల్లస్వామి, నడికూడ – కుడ్లే మలహలరావు, నార్లాపూర్ – పెద్ద బోయిన రవీందర్ యాదవ్, రాయపర్తి – రాజా జగత్ ప్రకాష్, సర్వాపూర్ – బోయిని శ్రీలత, చౌటుపర్తి–ఓదెల రూప సర్పంచులుగా గెలుపొందారు. వీరిలో ఎవరికి ఫోరం అధ్యక్ష పదవి దక్కుతుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

## - సీనియారిటీ కీలకమా?

సీనియారిటీ పరంగా పరిశీలిస్తే నడికూడ, నార్లాపూర్, కంఠాత్మకూర్ సర్పంచులకు అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. అయితే పార్టీ పెద్దల నిర్ణయం, స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకు తుది నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.

## - తుది నిర్ణయం ఎప్పుడంటే..

మండలంలోని సర్పంచుల సమావేశం అనంతరం లేదా పార్టీ నాయకత్వంతో సంప్రదింపుల తర్వాత ఫోరం మండల అధ్యక్షుడి పేరును అధికారికంగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. అప్పటివరకు నడికూడ మండలంలో ఈ అంశం రాజకీయంగా హాట్ టాపిక్‌గా కొనసాగనుంది.

# 12.30 లోపు ముగించుకోవాలి

- మత్తు పదార్థాలను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు
- నూతన సంవత్సర వేడుకలపై సీపీ సన్ ప్రీత్ సింగ్
- సంతోషాల నడుమ వేడుకలు నిర్వహించుకుందామని సూచన




అక్షరదర్బార్, హనుమకొండ: సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు. న్యూ ఇయర్ వేడుకలు సమీపిస్తున్న వేళ వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలు ప్రశాంతవంతమైన వాతవరణంలో ఎలాంటి ఆవాంచనీయ సంఘటనలు జరగకుండా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకొనేందుకు పలు సూచనలు చేస్తూ ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 31 రాత్రి నిర్వహించుకునే న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, షీ టీమ్స్‌తో పాటు పెట్రోలింగ్ విభాగాలకు చెందిన పోలీసులు ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారు. ముఖ్యంగా ఈ వేడుకలను ప్రజలు ఆర్థరాత్రి 12.30 గంటల లోపు ముగించుకోవాల్సి ఉంటుందని, ఈ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు, వేడుకలు నిర్వహించుకునే ప్రాంతంలో ఎలాంటి అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని, అలాగే కార్యక్రమాల నిర్వహణ ప్రదేశంలో తప్పనిసరిగా సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఎర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ వేడుకలు జరిగే సమయంలో ట్రాఫిక్ సమస్యలతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లవారికి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, వేడుకల్లో ఎలాంటి మత్తు పదార్థాలను వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రధానంగా ఈ వేడుకల వేళ యువకులు మద్యం సేవించి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనీఖీల్లో పోలీసులకు చిక్కితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని పేర్కొన్నారు. అలాగే వేగంగా వాహనాలు నడపడం, రోడ్లపై వెళ్ళేవారిని ఇబ్బందికి గురిచేసేలా వ్యవహరిస్తే సదరు వాహనదారులకు చట్టపరమైన తిప్పలు తప్పవని, రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు రాకుండా ట్రాఫిక్ సిబ్బందితో పాటు స్థానిక పోలీసుల అధ్వర్యంలో ట్రై సిటితో పాటు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనీఖీలు నిర్వహించబడుతాయని, ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని, ఈ అంక్షలను ఎవరైన అతిక్రమించిన, ఉల్లంఘించినట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించాలని, తద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని, ఈ వేడుకలను ప్రజలు, యువత తమ ఇండ్లలోనే కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతరణంలో నిర్వహించుకోవాలని సీపీ సన్ ప్రీత్ సింగ్ ప్రజలకు సూచించారు.



# సకల జనులకు శుభం జరగాలి

**- మంత్రి కొండా సురేఖ ఆకాంక్ష**

అక్షరదర్బార్, వరంగల్: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వరంగల్ బట్టల బజార్ లోని వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సమిష్టిగా అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించారు. సకల జనులకు శుభం జరగాలని ఆకాంక్షించారు. దైవారాధన మానసిక ప్రశాంతతను ప్రసాదిస్తుందని మంత్రి సురేఖ అన్నారు.

# నిందితుడికి ఏడాది జైలు

అక్షర దర్బార్, పరకాల: పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను అసభ్య ప్రవర్తనతో వేధించిన కేసులో కంఠాత్మకూరు గ్రామానికి చెందిన గోల్కొండ శ్రీనుపై కోర్టు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విధించి రూ.5వేలు జరిమానా విధించింది. కేసులో నిందితుడిపై ఐపీసీ 354(ఏ)(IV), 504, 509 సెక్షన్ల కింద నేరం రుజువైంది. అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ పరకాల బి.శ్రీవల్లి శైలజ తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అర్థ కుమార్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. ఎస్ఐ దీపక్ దర్యాప్తు నిర్వహించగా, సీఐ క్రాంతికుమార్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు సారంగపాణి సాక్షులను హాజరుపరిచారు.

# ఉపసర్పంచ్ ను సన్మానించిన క్లాస్ మెట్స్



అక్షర దర్బార్, చిట్యాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో చిట్యాల గ్రామపంచాయతీ ఉపసర్పంచిగా ఎన్నికైన బుర్ర వెంకటేష్ గౌడ్‌ను 1998–99 బ్యాచ్‌కు చెందిన క్లాస్మేట్స్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తాటిపల్లి శ్రీనివాస్, బాలవెని రాంబాబు, తూముల విజేందర్, ఈగ శ్రీధర్ బాబు, కోడెల అశోక్, గోల్కొండ మొగిలి, సాదా శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమానికి కంపెనీ కట్టుబడి ఉంది

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి
- మృతి చెందిన అన్ మ్యాన్డ్ వర్కర్ కుటుంబానికి రూ.25 లక్షల చెక్కు అందజేత
- విద్యుత్ ప్రమాదాల నివారణకు 'ఎల్సీ యాప్' వినియోగం



అక్షరదర్బార్, హనుమకొండ: విద్యుత్ శాఖలో విధి నిర్వహణ అనేది అత్యంత ప్రమాదంతో కూడుకున్నదని, అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే ఉద్యోగుల సంక్షేమం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఎల్లప్పుడూ ముందుంటుందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హన్మకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయంలో ఇటీవల విధి నిర్వహణలో మరణించిన జనగామ సర్కిల్ రఘునాథపల్లి సబ్ డివిజన్ నర్మెట్ట సెక్షన్ లో పనిచేసిన బానోత్ రాజు అన్ మ్యాన్డ్ వర్కర్ భార్య బానోత్ నీలకు న్యూఇండియా ఎస్యూరెన్సు కంపెనీ తరపున రూ.20 లక్షలు, ఎన్పీడీసీఎల్ కంపెనీ నుంచి రూ.5 లక్షల చెక్కును సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు అండగా నిలబడేందుకు రూ.కోటి ప్రమాద బీమా, అన్ మ్యాన్డ్ వర్కర్ లకు రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించామని చెప్పారు . విద్యుత్ ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, క్షేత్రస్థాయిలో భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలను నివారించడానికి ఎల్సీ యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఈ సందర్భంగా వివరించారు. ఎస్టీ అసోసియేషన్ నాయకులు బానోత్ రాజు భార్య నీలకు ఉద్యోగం కల్పించామని సీఎండీకి విన్నవించుకున్నారు. సీఎండీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి మోహన్ రావు, వి తిరుపతిరెడ్డి, టి మధుసూదన్, సి ప్రభాకర్, సీఈలు కె రాజు చౌహన్, జయవంత్ రావు చౌహన్, జనగామ ఎస్ఈ చెరుకు సంపత్ రెడ్డి, డీఈ జనగాం లక్ష్మి నారాయణరెడ్డి, ఏడీఈ రఘునాథపల్లి సుధాకర్, ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు నందా రాథోడ్, టీజీఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు హర్జి జాటోత్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా శ్రీరామ్ నాయక్ , జనగామ జిల్లా అధ్యక్షుడు బి బాలు నాయక్, సెక్రటరీ బి చంద్ర భాను నాయక్, రాంధన్ నాయక్, న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ హన్మకొండ సీనియర్ బిజినెస్ మేనేజర్ జ్యోతిర్మయి, క్లెయిమ్ ఆఫీసర్ బాలాజీ తదితర నాయకులు పాల్గొన్నారు .

# వాడబలిజల ఐక్యతే మహాబలం

**సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్**

అక్షర దర్బార్, నూగూరు–వెంకటాపురం: మహారాష్ట్ర రాష్ట్రం, గచ్చిరోలి జిల్లా, సిరవంచ మండలంలో మంగళవారం జరిగిన భారీ బహిరంగ సభకు తెలంగాణ రాష్ట్ర వాడబలిజ కమిటీ, జిల్లా, మండల కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్ మాట్లాడుతూ, తెలంగాణ నుండి బహిరంగ సభకు ఆహ్వానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అయితే, సిరొంచ మరియు తెలంగాణకు, అలాగే మూడు రాష్ట్రాల్లోని వాడబలిజలకీ ఐక్యత చాలా ముఖ్యమని, కలిసికట్టుగా ఉంటే గొప్ప బలం ఏర్పడుతుందని, విభజన అయితే బలహీనపడతామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్, అధికార ప్రతినిధి తోట మల్లికార్జున రావు, ఉపాధ్యక్షులు గార ఆనంద్, వ్యవస్థాపకులు డేనార్జన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్, అల్లిసూరిబాబు, కొప్పుల రఘుపతిరావు,




ములుగుజిల్లా ఉపాధ్యక్షులు గార తిరుపతి, మండల అధ్యక్షులు గార నాగార్జునరావు, వైస్ ఎంపీపీ బొల్లె భాస్కర్, మండల అధికార ప్రతినిధి బొల్లె నారాయణ, కోశాధికారి పానేం సురేష్, గౌరారపు రాంప్రసాద్, గార సాంబశివరావు పాల్గొన్నారు.

# 'రామప్ప సందర్శించిన హైదరాబాద్ అడిషనల్ సీపీ

అక్షర దర్బార్, వెంకటాపూర్ : రామప్ప శిల్పకళా సంపద బాగుందని హైదరాబాద్ అడిషనల్ సిపి క్రైమ్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుటుంబ సమేతంగా ఆయన రామప్ప రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సాదర స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ గైడు విజయ్ రామప్ప చరిత్రను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో సక్సెస్ చేయాలి

- మేడారం జాతర నిర్వహణపై మంత్రి సీతక్క
- సమ్మక్క సారలమ్మ కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగేలా జాతర నిర్వహిస్తామని వెల్లడి

అక్షరదర్బార్, మేడారం : శ్రీ సమ్మక్క సారలమ్మ కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరిగేలా జాతర నిర్వహిస్తామని, జాతర అభివృద్ధి పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని, అధికారులు సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మంగళవారం తాడ్వాయి మండలం కల్వపల్లి నుంచి ఊరట్టం వరకు రహదారి పనులను, కల్వర్టు నిర్మాణ పనులను, ఊరట్టం – కొండాయి రహదారి పనులను, కల్వర్టు నిర్మాణాన్ని, ఆలయ ప్రాంగణం ఫ్లోరింగ్ పనులను మంత్రి దనసరి అనసూయ సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాలతో కలిసి పరిశీలించారు. అనంతరం మేడారం హరిత హోటల్లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మేడారం జాతర అభివృద్ధి పనులను శాఖల వారీగా కూలంకషంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. షిఫ్ట్ ల వారిగా సిబ్బందిని ఉపయోగిస్తూ యుద్ధ ప్రతిపాదికన పనులను పూర్తి చేయాలని, అధికారులు చిత్తశుద్ధితో మనస్ఫూర్తిగా పనిచేసి జాతరను విజయవంతం చేయాలని సూచించారు. గత జాతర కంటే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. జాతర సమయంలో క్యూలైన్స్ పాత్ర కీలకంగా ఉంటుందని, క్యూలైన్స్, షేడ్స్ నిర్మాణాల్లో వేగం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీవో వెంకటేష్ , డీఎస్పీ రవీందర్ ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పేలుడు పదార్థాల కేసులో నిందితులు అరెస్ట్

\- 14 రోజుల రిమాండ్

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట ఎస్సె జె. పరమేశ్వర్ తన సిబ్బందితో సోమవారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పత్తిపాక గ్రామంలోని చిన్న బ్రిడ్జి వద్ద ముగ్గురు అనుమానాస్పద వ్యక్తులను పట్టుకున్నారు. వారిని విచారించగా వారి వద్ద ప్రేలుడు పదార్థాలు ఉండటాన్ని గుర్తించారు. ఇందులో బొంత శ్రీను (యాదాద్రి జిల్లా), తన బంధువులు ఇరుగదిండ్ల శివశంకర్, బొంత అజయ్, ఆత్మకూర్ గ్రామస్తుడు తంగేళ్ల బ్రహ్మం వద్ద ప్రేలుడు పదార్థాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్మే ప్రయత్నంలో ఉన్నారు. రూ.11వేలతో కొనుగోలు చేసి వసంతాపూర్ కు చెందిన చల్లా రాజిరెడ్డికి అందించాలనుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని పరకాల కోర్టులో హాజరు పరచగా 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించబడింది.

## రంగాపురంలో అభివృద్ధి పనులు



అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలం రంగాపురం గ్రామంలో ఆరు నెలలుగా పాడైపోయి నిరుపయోగంగా ఉన్న బోర్ బావిని గ్రామ సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు మరమ్మతు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో నీటి సౌకర్యాన్ని ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏడో వార్డు మెంబర్ జోగు ప్రభాకర్, ఐదో వార్డు మెంబర్ పాల పిందల శిరీష చిరంజీవి, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## న్యూఇయర్ వేడుకల్లో డీజే నిషేధం

: ఎస్సై గోవర్ధన్ హెచ్చరిక




అక్షర దర్బార్, నల్లబెల్లి: నల్లబెల్లి మండలంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎస్సె వి. గోవర్ధన్ మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఏవిధమైన అసాంఘిక, అశ్లీల కార్యక్రమాలు జరగకుండా ఉండాలని సూచించారు. పోలీసు అనుమతులు లేకుండా డీజే, సౌండ్ సిస్టమ్ లేదా ఫైర్ క్యాంప్స్ నిర్వహిస్తే, అలాగే మద్యపానం చేసి రోడ్లపై రేస్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్సె గోవర్ధన్ ప్రతి ఒక్కరినీ, వారి కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితంగా, ఇంటిలోనే న్యూ ఇయర్ వేడుకలు జరపాలని పిలుపునిచ్చారు.

# వార్డెన్ భవానిపై వేటు

- భూపాలపల్లి ఎస్సీ హాస్టల్ విద్యార్థినిపై దాడి
- ఘటనపై కలెక్టర్ రాహుల్ శర్మ సీరియస్
- వార్డెన్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు

అక్షరదర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్లో విద్యార్థినిపై వార్డెన్ జరిపిన అమానుష దాడి ఘటనపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్రంగా స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి విద్యార్థిని పట్ల పైశాచికంగా దాడి చేసిన వార్డెన్ భవానిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం శాఖాపరమైన చర్యలు చేపట్టింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తమయ్యాయి. హాస్టల్లో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థినిపై వార్డెన్ భవాని విచక్షణారహితంగా దాడికి తెగబడ్డారు. నిర్ణీత సమయం కంటే కొంత ఆలస్యంగా హాస్టల్కు చేరుకుందనే కారణంతో సదరు విద్యార్థినిని వార్డెన్ బూతులు తిడుతూ దారుణంగా కొట్టారు. చేతులతోనే కాకుండా కర్ర తీసుకుని గొడ్డును బాదినట్లు విద్యార్థినిని హింసించారు. ఆ సమయంలో తోటి విద్యార్థినులు కొట్టవద్దని వేడుకున్నా వార్డెన్ కనికరం చూపకుండా తన పైశాచికత్వాన్ని ప్రదర్శించారు. ఈ అమానుష ఘటనను తోటి విద్యార్థినులు తమ ఫోన్లలో చిత్రీకరించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో బయటకు రావడంతో వార్డెన్ ప్రవర్తనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ దాడి గత నెల నవంబర్ 24వ తేదీన జరిగినట్లు సమాచారం. విద్యార్థిని ఆలస్యంగా బయటకి చెప్పడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కలెక్టర్ స్పందించి సదరు వార్డెన్ను సస్పెండ్ చేయడంతో బాధితురాలి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.



## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని

అక్షరదర్బార్, హనుమకొండ: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉత్తర ద్వారం ద్వారా వైకుంఠ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, నియోజకవర్గ అభివృద్ధి, సమగ్ర సంక్షేమం కోసం స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915